

కాళికాంబకు విశేష పూజలు

కర్లపాలెం: స్థానిక కాళికాంబ సమేత వీర భద్రస్వామి ఆలయంలో శనివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ఆలయం ముందు 11 కేజీల కర్పూరాన్ని వెలిగించారు.



కార్తిక మాస హోమాలు

తెనాలి: స్థానిక మారిస్‌పేటలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా శనివారం హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 588.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,274 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

ప్రారంభమైన పల్నాటి వీరారాధన ఉత్సవాలు



ఎర్ర జెండా ప్రతిష్ఠిస్తున్న తరుణ్ చెన్నకేశవ

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కార్యమపూడి (కారెంపూడి)లో పల్నాటి వీరుల ఆరాధన ఉత్సవాలు కార్తిక అమావాస్య శనివారం ప్రారంభమయ్యాయి. వీరుల గుడికి ఎరుపు తెలుపు చారలతో వెల్ల వేశారు. తర్వాత ఆయుధాలను బయటకు తీసి గుడి మొత్తాన్ని శుద్ధి పరచారు. ఆయుధాలను కూడా కడిగి శుభ్రం చేశారు. మరో వైపు వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు ఒక్కొక్కరుగా వీరుల గుడి ప్రాంగణానికి చేరుకుంటున్నారు. రాత్రి వీరుల గుడి ముఖ మండపంపై పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ ఎర్రజెండాను ప్రతిష్ఠించారు. రణక్షేత్రం ఉత్సవశోభను సంతరించుకుంది. తొలి రోజు 'రాచగావు'తో ప్రారంభమైంది. పోతురాజుకు దిబ్బం పెట్టి వీరుల ఆత్మశాంతికి ముద్దలు సమర్పించారు. వీరుల గుడి పూజారులు పోతురాజు ఆచారవంతునితో కలసి పోతురాజుకు గావు చెల్లించారు. ఆదివారం 'రాయబారం' చారిత్రక ఘట్టం పేరుతో ఉత్సవం జరగనుంది. తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు శనివారం విరాళాలను అందజేశారు. గుంటూరు జిల్లా పెదకాకానిలోని సదాశివరావు కాలనీకి చెందిన కోసూరి శివరామకృష్ణ కుటుంబం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది. ఈ సందర్భంగా నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందించింది. విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన యెందూరి బ్రహ్మలింగేశ్వర స్వామి కుటుంబం కూడా రూ. 1,01,116 విరాళంగా ఇచ్చింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. శివరామకృష్ణ కుటుంబ సభ్యులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి చిత్రపటం అందించారు. బ్రహ్మలింగేశ్వర స్వామి కుటుంబానికి ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

భ్రమరాంబికాదేవికి వెండిహస్తాలు వితరణ



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలోని అమ్మవారికి మిర్యాల గ్రామానికి చెందిన అలవాల నర్సిరెడ్డి, మంగమ్మ, శ్రీనివాసరెడ్డి, అరుణ, నీరజ్‌రెడ్డి, నిఖిలారెడ్డి దంపతులు వెండి హస్తాలు శనివారం అందజేశారు. కార్తికమాసం సందర్భంగా శనివారం దేవస్థానంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వెండి హస్తాలు వితరణ ఇచ్చిన వారికి ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అర్చకులు మల్లికార్జున శర్మ కృతజ్ఞతలు తెలిపారు.

వంచనపై వలంటీర్ల పోరుబాట



తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గుంటూరులో ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు

- 2.60 లక్షల మందిని కాపాడుకోలేని కూటమి సర్కారు
- 20 లక్షల ఉద్యోగాల పేరిట యువతను మభ్యపెడుతున్న సీఎం
- ఎన్నికల హామీ అమలు చేయకుంటే ప్రభుత్వ పతనం ఖాయం
- న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం మరింత ఉధృతం

గుంటూరు వెస్ట్: ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ అతి తక్కువ జీతాలకు పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను కాపాడుకోవాల్సిన నైతిక బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ హుమయూన్ బాషా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ నుంచి కలెక్టరేట్ వరకు భారీ సంఖ్యలో వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లంటే కూటమి ప్రభుత్వానికి చిన్నచూపన్నారు. కేవలం రూ.5 వేల జీతంతో ఎంతో నిబద్ధతతో పనిచేశామని గుర్తుచేశారు. వలంటీర్లను కొనసాగించేందుకు జీఓ లేదని చెబుతున్న కూటమి నేతలకు కొనసాగింపు జీఓ జారీ చేయడం పెద్ద పనేమీ కాదన్నారు. 2.60 లక్షల మంది వలంటీర్లనే కాపాడుకోలేకపోతున్న కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి కూటమి ప్రభుత్వ ఓటమికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్లే తక్కువ జీతాలకు వలంటీర్ల ఉద్యోగాలు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిని కూడా లాగేసుకుంటే చూస్తూ ఊరుకోబోమని బాషా హెచ్చరించారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలంటీర్లు



చిలుక జోస్యం చెప్పించుకుంటూ వినూత్న నిరసన

మా ఆవేదన వినేవారే లేరు



ఎన్నికల సమయంలో చిలుకపలుకులు పలికిన కూటమి నాయకులు ఇప్పుడు కనీసం మా కష్టాలు వినడానికి కూడా ముందుకు రావడం లేదు. మాకు ఎవ్వరిపైనా ద్వేషం లేదు. మా బాధలు అర్థం చేసుకోండి. మేం కూడా ఈ రాష్ట్ర ప్రజలమే కదా. మాకు కష్టం వస్తే పట్టించుకోరా?

– దుర్గ, వలంటీర్

మేం చేసిన తప్పేంటి?



పెద్ద చదువులు పూర్తి చేసినా ఉద్యోగాలు లేక వలంటీర్లుగా పని చేస్తున్నాం. ముఖ్యంగా పేదలకు సాయం చేసే అవకాశం ఉంటుందని సర్దుకుపోతున్నాం. మమ్మల్ని కూటమి ప్రభుత్వం ఎందుకు శత్రువులుగా చూస్తుందో అర్థం కావడం లేదు. మా ఆవేదనను పెద్ద మనస్సుతో అర్థం చేసుకోవాలి.

– బ్యూలా రోజ్, వలంటీర్

సహనాన్ని పరీక్షించకండి



గడచిన ఆరు నెలలుగా ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల కుటుంబాలు రోడ్లపై వచ్చి నిరసన చేస్తే ఎంత దారుణంగా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలి. మా సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది.

– దోలా విజయ్ కుమార్, వలంటీర్

నోటి దగ్గర కూడు లాగేశారు



రాజకీయ కారణాల నేపథ్యంలోనే మాపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. ఎన్నికల ముందు తమకు జీతం రూ.5 వేలు ఉండగా, ఏకంగా రూ.10 వేలు చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. జీతం పెంచకపోగా ఉద్యోగం కూడా లేకుండా చేసి మా నోటి దగ్గర కూడు లాగేశారు. భగవంతుడు దీనిని క్షమించడు.

– దోలా స్వప్న, వలంటీర్

తోరణంగా వరి.. సంప్రదాయం మరి..!



ధాన్యం ఇంటికి రాగానే వరి కంకులతో ఇంటిని అలంకరించటం అన్నదాతకు ఒకప్పటి అలవాటు. ఇలా అలంకరించటం ఒక ఆకర్షణగానే కాదు.. కంకుల్లోని గింజలను పిచ్చుకలు, చిలకలు వంటి పక్షులు ఆరగించేవి. ఈ సంప్రదాయం క్రమేపీ మాయమైంది. ఆ స్థానంలో ప్లాస్టిక్ దండలు, ప్లాస్టిక్ పూలు వచ్చి చేరాయి. ఈ నేపథ్యంలో కొల్లిపర మండల గ్రామం తూములూరుకు చెందిన మహిళా రైతు వింతా సుజాత శనివారం వరి కంకులతో తన ఇంటిని అలంకరిస్తూ కనిపించారు. ప్రధాన దర్వాజాకు తోరణంగా వరి కంకులను వేలాడదీశారు. ఇంటి ముందు గుమ్మటాలుగా చేసి అలంకరించారు. కాస్త శ్రమ అనిపించినా కుటుంబ సభ్యుల సహకారంతో వీటిని తయారు చేశారు. అలంకరించాక చూసి అబ్బురపడ్డారు.

- తూములూరు(తెనాలి)



ఏఎన్‌యూలో త్రిసభ్య కమిటీ పర్యటన



విద్యార్థినులతో మాట్లాడుతున్న సంజనా సింహ



వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

- విద్యార్థినులు, అధికారులతో వేర్వేరుగా చర్చలు
- అన్ని అంశాలతో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక
- తెనాలి సబ్ కలెక్టర్, త్రిసభ్య కమిటీ సభ్యురాలు సంజనా సింహ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా వసతి గృహాల్లో ఆహార పదార్థాలు, పరిశుభ్రత తదితర అంశాలపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. గుంటూరు జిల్లా తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఎస్ఓ పద్మజ, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ రెడ్డిలతో కూడిన కమిటీ శనివారం యూనివర్సిటీలో పర్యటించింది. భోజనంలో జెర్రి, కప్పలు, పురుగులు వస్తున్నాయని వసతి గృహాల విద్యార్థినులు శుక్రవారం ధర్నాకు దిగిన నేపథ్యంలో శనివారం వీరు వర్సిటీలోని మహిళా వసతి గృహాలలో వంట గదులు, భోజనశాల, ఆహార పదార్థాలు, సరకుల నాణ్యత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు.

పురుగుల అన్నమే దిక్కు

కమిటీ సభ్యులతో విద్యార్థినులు మాట్లాడుతూ.. పురుగుల అన్నం పెడుతున్నారని వాపోయారు. గతంలో ఆహార పదార్థాల్లో జెర్రి, కప్ప వచ్చాయని చీఫ్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదన్నారు. వేరే కూర వండాలని సిబ్బందికి సూచించారే కానీ, దానికి కారకులపై చర్యలు చేపలేదని చెప్పారు. విషయం బయట చెబితే మీ చదువులకే ఇబ్బందని వార్డెన్ బెదిరించేవారని వాపోయారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ మీడియాతో మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని పరిస్థితులపై తమకు స్పష్టత వచ్చిందన్నారు. విద్యార్థినులు తమ సమస్యలు వివరంగా చెప్పుకొనేందుకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేకంగా సమావేశం అవుతామన్నారు. ఫిర్యాదు చేసినా వర్సిటీలో ఎవ్వరికీ తెలియనీయబోమని చెప్పారు. ప్రభుత్వానికి మూడు రోజుల్లో నివేదిక సమర్పిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెడ్ కుక్, కుక్‌లను సస్పెండ్ చేస్తూ వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అనంతరం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఉన్నతాధికారుతో సభ్యులు సమావేశమయ్యారు. ఆర్డీఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు విలేకర్లతో మాట్లాడుతూ బయటి ఆహార పదార్థాలు తెప్పించుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు

త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. రామ్మోహనరావు తెలిపారు. ఐఏఎస్ అధికారి భరత్ గుప్తాతో కలిసి ఆయన మహిళా వసతి గృహాల్లో పరిస్థితిని పరిశీలించారు.

జిల్లా కోర్టులో హైకోర్టు జడ్జి పరిశీలన



కోర్టు పరిసరాలను పరిశీలిస్తున్న హైకోర్టు జడ్జి



జస్టిస్ రఘునందనరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా జడ్జి వైవీఎస్‌బీజీ పార్థసారథి

నగరంపాలెం: హైకోర్టు జడ్జి, గుంటూరు జిల్లా పరిపాలన జడ్జి జస్టిస్ ఆర్.రఘునందనరావు శనివారం జిల్లా కోర్టుకు విచ్చేశారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి పుష్పగుచ్ఛం అందించి, స్వాగతించారు. అనంతరం డీజే సమావేశ మందిరంలో జిల్లా న్యాయమూర్తులతో జస్టిస్ ఆర్. రఘునందనరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. సీనియర్, జూనియర్ కోర్టులకు సంబంధించి కేసులను పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం మొదలు ప్రతి కోర్టులోనూ కలియతిరిగారు. ఆయా కోర్టుల పనితీరును జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివరించారు. ఒకటో అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి, నాలుగో అదనపు జిల్లా జడ్జి శరత్‌బాబు, ఐదో అదనపు జిల్లా జడ్జి నీలిమ, ఫ్యామిలీ కోర్టు జడ్జి చక్రపాణి, నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి సత్యశ్రీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాలోని న్యాయవాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తామని జస్టిస్ ఆర్. రఘునందనరావు అన్నారు. కోర్టు ఆవరణలోని జిల్లా బార్ కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లాకు తలమానికమైన తెనాలి కోర్టుకు ఏడు మండలాలకు సంబంధించి వెయ్యి మందికిపైగా హాజరవుతారని తెనాలి బార్ అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. అయితే బార్ కౌన్సిల్ హాల్ లేదని, ప్రస్తుతం పెంకిటిల్లులో కొనసాగుతోందన్నారు. అందులో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనూరాధ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జెడ్పీ వార్షిక బడ్జెట్ రూ.643.80 కోట్లు

- 2025–26 బడ్జెట్ ప్రతిపాదనలకు స్థాయీ సంఘం ఆమోదం
- త్వరలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి బడ్జెట్ ప్రతిపాదనలు
- రూ.తొమ్మిది కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆమోదం
- ఏడాది గడిచినా ప్రారంభం కాని పనులు రద్దుకు నిర్ణయం



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఏడు స్థాయీ సంఘాలకుగాను ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఆమె చాంబర్లో నిర్వహించారు. వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం సమావేశం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధల అధ్యక్షతన జరిగాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643.80 కోట్లతో రూపొందించిన భారీ బడ్జెట్‌లో జెడ్పీ సాధారణ బడ్జెట్ రూ.71.11 కోట్లు. మిగిలిన 572.69 కోట్లు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలకు సంబంధించినవి. పీఆర్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల వార్షిక బడ్జెట్ అంచనాలను జెడ్పీ ఆమోదించాల్సి ఉండటంతో స్థాయీ సంఘ సమావేశంలో ప్రవేశపెట్టారు. జెడ్పీటీసీల విజ్ఞప్తి మేరకు రూ. 9 కోట్ల వ్యయంతో గ్రామాల్లో 108 అభివృద్ధి పనులు చేపట్టేందుకు సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ప్రజా అవసరాల మేరకు గతంలో ఆమోదించిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని ఆయా శాఖల వారీగా అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. టెండర్లు దక్కించుకుని, ఏడాది గడిచినా ప్రారంభించని అభివృద్ధి పనులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సంబంధిత పనులకు తాజాగా అంచనాలు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అదే విధంగా 35 మండల పరిషత్‌లకు చెందిన వార్షిక బడ్జెట్ అంచనాలను ఆమోదించారు. కాగా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలతోపాటు వివిధ శాఖల వారీగా గతంలో కేటాయించిన అభివృద్ధి పనులు ఏడాది గడిచినా ప్రారంభించలేదని గుర్తించారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, డ్వామా, గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఇరిగేషన్, విద్యా, వైద్యారోగ్య శాఖల వారీగా చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అధికారులు వివరించారు. జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు, ఏవోలు, అధికారులు పాల్గొన్నారు.

వికాస కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్‌తో నూతన కార్యవర్గం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పోటీలో ఫ్రెండ్స్ ప్యానెల్ ఉండటంతో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఆచార్య ఎస్ మురళీ మోహన్ శనివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా నీలపు ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా దాసరి విజయ ప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులుగా నేలపాటి నాగేశ్వరరావు, తోట వెంకటేష్, కోశాధికారిగా కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులుగా చిమట ఆనంద్ కుమార్, పి. నాగరాజు, సి.హెచ్.సాంబశివరావు, కేతావత్ శశిధర్, జి. శ్రీను, నల్లగొర్ల శ్రీనివాసరావు, ఈ శ్రీనివాసరెడ్డి, టంకశాల వెంకటేశ్వరరావు, నూతక్కి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం అభినందనలు తెలిపారు.

4న కాంట్రాక్టు అధ్యాపకుల సత్యాగ్రహ దీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, బీజే గాంధీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు తెచ్చిన జీవో నెం.114 అమల్లో భాగంగా కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణకు నోచుకోగా, అధ్యాపకులు నోచుకోలేదన్నారు. అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. దీక్షకు ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు మద్దతు ఇచ్చాయన్నారు.

క్లుప్తంగా

ఉత్తరాఖండ్‌పై ఆంధ్ర జట్టు ఆధిక్యం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహరా ట్రోఫీలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ జట్టుపై ఆంధ్ర జట్టు ఆధిక్యం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 80 ఓవర్లలో 337 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 70.01 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. బ్యాట్స్‌మెన్ అరవ్ మహిపాల్ 103 పరుగులు సాధించగా, బౌలర్లు ఎస్.రాజేష్ 6 వికెట్లు, ఏవీఎస్ లోహిత్ 4 వికెట్లు సాధించారు.

పరిశుభ్రతకు రైల్వే శాఖ ప్రాధాన్యం



లక్ష్మీపురం: ప్రయాణికులకు వసతుల కల్పనలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని 4 రైళ్లకు బెడ్ రోల్స్ సరఫరా అవుతున్నాయని, వాటితోపాటు దుప్పట్లను ప్రతి నెలా శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ మద్దాలి రవికిరణ్, ఏడీఎంఈ బాపయ్య, డీసీఎం కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన

నగరంపాలెం: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన వైభవంగా జరిగింది. తానా, దర్శనం టీవీ ఛానల్, సిటీ కేబుల్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో భావితరాల్లో భక్తి భావం పెంపొందే అవకాశం ఉందని చెప్పారు. ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహమ్మద్ నసీర్ మాట్లాడుతూ నేటి యువత సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దగ్గరగా ఉండాలని అన్నారు. సిటీ కేబుల్ ఎండీ దండమూడి కృష్ణమోహన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల నుంచి గాయనీ గాయకులు హాజరై అన్నమయ్య గీతాలు ఆలపించారని అన్నారు. చిన్నారుల్లో మరింత స్ఫూర్తిని నింపేందుకు ఏటా సహస్ర గళార్చన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, ఎన్నారై కోలా అశోక్‌బాబు, శ్రీవిద్యా ఉపాసకులు బ్రహ్మశ్రీ జయశంకర్ శిష్ట పాల్గొన్నారు. వెయ్యి మంది గాయనీ గాయకులతో అన్నమయ్యకు గళసేవ నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనల మేళవింపుతో సహస్ర గళార్చన ఆద్యంతం శ్రవణానందంగా సాగింది. పవిత్ర కార్తీక మాసంలో చివరి రోజైన శనివారం గళార్చన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. సాయంసంధ్యవేళ అన్నమయ్య సంకీర్తనలతో సమ్మోహనంగా సహస్ర గళార్చన కొనసాగింది.



సంకీర్తనలు ఆలపిస్తున్న వైష్ణవి



సహస్ర గళార్చన చేస్తున్న మహిళలు

అణచివేయాలని చూస్తే ఎగసిపడతాం

- వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాల వజ్రబాబు
- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారనే అక్రమ కేసులో నోటీసు స్వీకరణ

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): వ్యవస్థలను, వ్యక్తులను అణచివేయాలని చూస్తే మరింత ఎగసి పడతామనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) స్పష్టం చేశారు. ఈ నెల 2వ తేదీన రాజాగారితోటలోని శ్రీ వెంటేశ్వర విజ్ఞాన మందిరంలో డైమండ్ బాబు నగర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో కాకాని రోడ్డులో నుంచి రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్



డైమండ్‌బాబు, ఇతర నేతలకు 41ఏ నోటీసులు అందజేస్తున్న ఎస్‌హెచ్‌వో వీరసోమయ్య

కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వచ్చిన నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా ఎదురేగి స్వాగతం పలికారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందన్న నెపంతో డైమండ్ బాబు, కార్పొరేటర్ ఆబీద్ బాషా, పార్టీ నేతలు వాకా శ్రీనివాసరెడ్డి, రాణాప్రతాప్‌లపై పాత గుంటూరు పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి, శనివారం 41ఏ నోటీసులు ఇచ్చేందుకు డైమండ్‌బాబుతోపాటు పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పార్టీ నేతలను స్టేషన్ వద్దకు పిలిపించారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీర సోమయ్యతో పార్టీ నేతలు చర్చించారు. అనంతరం డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి ఆదరణ చూసి ఓర్వలేక కూటమి నేతలు ఇలాంటి కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతలు చేస్తున్న ర్యాలీలు, ఊరేగింపులు పోలీసుల కళ్లకు కనపడటం లేదా? అని సూటిగా ప్రశ్నించారు. తమకు న్యాయస్థానాలు, పోలీసు వ్యవస్థపై అపారమైన గౌరవం ఉందని తెలిపారు. ఈ క్రమంలో 41ఏ నోటీసులు ఇచ్చేందుకు పిలిచిన నేపథ్యంలో వచ్చి స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్‌లు, అనుబంధ విభాగాల నేతలు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆరు పళ్ల ఎడ్ల విజేత పెదపరిమి, తుళ్లూరు జత

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలలో ఆరు పళ్ల విభాగంలో తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి, కొల్లిపరకు చెందిన గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి కంబైన్డ్ జత 3,200 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 2,812 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత తృతీయ స్థానాన్ని, గురజాలకు చెందిన లింగా అంజయ్య చౌదరి, ధరణి ఎడ్ల జత 4వ స్థానంలో నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 5వ స్థానంలో పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం రెడ్డిపాలెంకు చెందిన పిడవర్తి శ్రీనివాసరెడ్డి, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి ఎడ్ల జత 6వ స్థానంలో నిలిచాయి. మొత్తం ఏడు జతలు పాల్గొనగా ఆరు నగదు బహుమతులు షీల్డ్‌లను బహూకరించారు.

20 నుంచి స్పోర్ట్స్ ఫెస్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఈ నెల 20, 21వ తేదీల్లో ఆదర్శ్–2024 పేరుతో జాతీయస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ నిర్వహిస్తామని కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శనివారం పోస్టర్లు విడుదల చేశారు. చెస్, వాలీబాల్, త్రోబాల్, క్యారమ్స్, కబడ్డీ, షాట్‌పుట్ పోటీలకు ఈనెల 14లోపు హెచ్ఐఎన్‌డీయూఈఎస్‌జీజీ.కామ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు ఇస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ పీఏ ప్రసాద్, ప్రిన్సిపల్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, కె. రవి పాల్గొన్నారు.

ఫొటోలు వాస్తవాలకు ప్రతిబింబాలు

ఏఎన్‌యూ: ఫొటోలు వాస్తవాలకు ప్రతిబింబాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.రామ్మోహన్ రావు అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాలు సంయుక్తంగా శనివారం వర్సిటీలో నిర్వహించిన 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవాలకు చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జర్నలిజం విభాగం ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె. మధు బాబు అధ్యక్షత వహించారు. ఆచార్య కె. రామ్మోహన్ రావు మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ రంగం ఎంతో అభిలాషతో కూడుకున్నదని తెలిపారు. దానికి తగినట్లుగా వాస్తవాలను ప్రతిబింబించేలా ఫొటోలు ఉండాలన్నారు. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీకి సంబంధించిన కోర్సులు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.పి.ఎస్.పాల్ కుమార్, ఫొటోగ్రఫీ అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, వైద్య నిపుణులు, ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఫొటోగ్రఫీలో నైపుణ్యాల ప్రదర్శించిన రెండు తెలుగు రాష్ట్రాలకు 25 మందికి బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతులు పొందిన ఫొటోగ్రాఫర్లు

తెనాలి ఫొటోగ్రాఫర్‌కు పురస్కారం

తెనాలి: తెనాలికి చెందిన ఫొటోగ్రాఫర్, తెనాలి కెమెరా క్లబ్ కార్యదర్శి ఓలేటి రవికుమార్ తీసిన 'రెస్ట్ టైం' ఫొటోకు కెప్టెన్ టీఎఫ్ గెటి స్మారక అవార్డు లభించింది.

సమాజం కోసం పాటుపడిన గాదె సుబ్బారెడ్డి

- సీపీఎం నాయకుల ఘన నివాళి

తాడేపల్లి రూరల్ : ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కళారూపాలు రూపశిల్పి గాదె సుబ్బారెడ్డి (78) శనివారం మృతి చెందారు. గాదె సుబ్బారెడ్డి భౌతిక కాయానికి మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి. మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్ అధ్యక్షతన సాయంత్రం జరిగిన సంతాప సభలో మధు మాట్లాడుతూ.. కళారూపాలను తీర్చిదిద్దడంలో సుబ్బారెడ్డి కొత్త ఒరవడి సృష్టించారని కొనియాడారు. సాధారణమైన పేద ప్రజలకు అర్థమయ్యేరీతిలో కళారూపాలు తయారు చేయడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రంలో ప్రజాకవి సుద్దాల హనుమంతు పేరుతో రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర వారసత్వాన్ని కొనసాగించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సిద్ధాంతం కోసం ప్రజల పక్షాన నిలబడి పనిచేసిన గొప్ప వ్యక్తి సుబ్బారెడ్డి అని కొనియాడారు. ఆయన మృతి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ప్రజానాట్యమండలి, బాలోత్సవ కార్యక్రమాలకు తీరని లోటని అన్నారు. సుబ్బారెడ్డి మృతికి సాంస్కృతిక ఉద్యమాల తరపున సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... పిల్లలు, పెద్దలు అందరితో కలిసిపోయే స్వభావం ఆయనదని చెప్పారు. పార్టీ ఆదేశానుసారం ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ అవసరం ఉన్నా పనిచేశారని తెలిపారు. భార్య శివలీలతోపాటు కుటుంబ సభ్యులందరినీ పార్టీవైపు నిలబెట్టారని కొనియాడారు. ఎంబీవీకే కార్యదర్శి పి. పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ... ప్రజా ఉద్యమంలో 55 ఏళ్ల సుదీర్ఘ అనుబంధం తమదని గుర్తుచేసుకున్నారు. కరోనా సమయంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పోటీలు నిర్వహించడం ఆయన దార్శనికతకు నిదర్శనమని అన్నారు. సుబ్బారెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, సీనియర్ నాయకులు జొన్న శివశంకర రావు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజా నాట్య మండలి కళాకారులు, ఏలూరు, ఉయ్యూరు, కంకిపాడు, విజయవాడకు చెందిన పలువురు పార్టీ నాయకులు, ప్రజా సంఘాలకు ప్రతినిధులు ఉన్నారు. సుబ్బారెడ్డి మృతదేహాన్ని మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి వైద్య పరిశోధనల కోసం కుటుంబ సభ్యులు అప్పగించారు. నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్.వి.ఆర్. ఆసుపత్రికి అందించారు.



గాదె సుబ్బారెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు